పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

- స్వచ్ఛతా హీ సేవలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- పలు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు
- పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



షాద్‌నగర్: కళాశాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు

షాద్‌నగర్: పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దరిచేరవని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ–2024లో భాగంగా బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వచ్ఛదనం, పరిశుభ్రత కార్యక్రమంలో అందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలన్నారు. పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని యజ్ఞంలా నిర్వహించి, సీజనల్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను బాధ్యతగా భావించాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఫైర్ ఇంజన్ ప్రారంభం

షాద్‌నగర్ అగ్నిమాపక కేంద్రానికి నూతనంగా సుమారు కోటి రూపాయల విలువ చేసే అత్యాధునిక ఫైర్ ఇంజన్ మంజూరైంది. ఈ వాహనానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు బాబర్‌ఖాన్, చెంది తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, ముబారక్, అందె మోహన్, బస్వం,చల్లా శ్రీకాంత్ రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, బచ్చలి నరేశ్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, కళాశాల ప్రిన్సిపాల్ సర్వేశ్వర్‌రెడ్డి,ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ జగన్ పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ పోషకాలున్న సమతుల్య ఆహారం తీసుకోవాలని డీపీఎం స్వర్ణలత అన్నారు. బుధవారం మండలంలోని మహిళా సమాఖ్య సభ్యులతో కలిసి ఫుడ్ ఫెస్టివల్, ర్యాలీ, ప్రతిజ్ఞ వంటి కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ సంధ్య, ఏపీఎం శోభారాణి, మండల అధ్యక్షురాలు పుష్పలత, సీసీలు, వీఓఏ, ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల: చేవెళ్లలో ర్యాలీగా వెళ్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

విద్యార్థులకు స్వచ్ఛతపై పోటీలు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు బుధవారం విద్యార్థులకు స్వచ్ఛదనం, పరిశుభ్రతపై ఉపన్యాసం, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రేవతి, వినయశీల, అన్నపూర్ణ, శైలజ, సతీశ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌రూరల్/షాబాద్: గ్రామాల్లో రేషన్ డీలర్లకు గౌరవ వేతనం, కమీషన్ పెంపు వివిధ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ద్వారా కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, లక్ష్మీనారాయణ, భాస్కర్‌రెడ్డి రేషన్ డీలర్లతో కలిసి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా రేషన్ డీలర్లకు గౌరవ వేతనం, కమీషన్ పెంపు, వివిధ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయాలని మెమోరాండం ద్వారా కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌బాబు, సత్తయ్యగౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాను చందర్‌గౌడ్, కార్యదర్శి ఎం.డీ.రఫీక్, విజయసూర్య, కృష్ణ, సందీప్, శివయాదవ్, వీరస్వామిగౌడ్, షాబాద్ మండల అధ్యక్షులు నర్సింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మొయినాబాద్ మండల కోశాధికారి పాలమాకుల యాదయ్యయాదవ్, మొయినాబాద్, చేవెళ్ల, షాబాద్ మండలాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే బీజేపీ ధ్యేయం

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా కొనసాగింది. ఒక వైపు మున్సిపల్ అధ్యక్షుడు బీర్ల సురేశ్, మరోవైపు మున్సిపల్ ఇన్‌చార్జి వాసుదేవ్ కన్నా ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా సాగింది. అనంతరం వారిద్దరూ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కేంద్రంలో ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో ఘోరంగా విఫలమైందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, నర్సింహ, రాజ్‌కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

వైద్యులను తప్పనిసరిగా సంప్రదించాలి



శంకర్‌పల్లి: సిబ్బందికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

శంకర్‌పల్లి: ఆరోగ్యం విషయంలో ఎలాంటి మార్పులు చోటు చేసుకున్నా తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ప్రజలకు సూచించారు. బుధవారం మున్సి పల్ కార్యాలయంలో సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. మారుతున్న కాలం, ఆహారపు అలవాట్లు, రసాయనాలు వాడిన కూరగాయల కారణంగా వ్యాధులు సులభంగా వస్తున్నాయన్నారు. శరీరంలో ఏ విధమైన ఇబ్బంది తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదిస్తే మొదటి దశలోనే వ్యాధిని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ విజయలక్ష్మిప్రవీణ్‌కుమార్, మండల వైద్యాధికారి రేవతిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



కేశంపేట: మండల కేంద్రంలో పరిశుభ్రతపై అవగాహన

కేశంపేట: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో స్వచ్ఛ తపై అవగాహన ర్యాలీ, పరిశుభ్రత, మొక్కలు నాటడం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం జిమ్స్ ఆస్పత్రి సహకారంతో గ్రామంలో గ్రామ పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ కిష్టయ్య, పంచాయతీ కార్యదర్శి విద్యావతి, జిమ్స్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ పూనమ్ సుతార్, డాక్టర్ విరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

చేవెళ్ల ఐసీడీఎస్ సీడీపీఓ హెఫెజిబా

షాబాద్: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని చేవెళ్ల ఐసీడీఎస్ సీడీపీఓ హెఫెజిబా, షాబాద్ ఎంపీడీఓ అపర్ణ పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో చేవెళ్ల ప్రాజెక్టు మండల స్థాయి పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పోషకాలు కలిగిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. బాలింతలు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. పోషణ, పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాలపై ప్రతిజ్ఞ చేయించారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తప్పక పోషణ మాసోత్సవాలను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సృజన, రమాదేవి, పారిజాతం, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, తదితరులు ఉన్నారు.



చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న హెఫెజిబా, తదితరులు

దీన్ దయాళ్ సేవలు చిరస్మరణీయం

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్

షాద్‌నగర్: దేశానికి దీన్ దయాళ్ చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్ అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ సిద్ధాంతకర్త జనసంఘ్ వ్యవస్థాపకుడు దీన్ దయాళ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్ దయాళ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రీయ స్వయం సంఘ్ భావజాలంలో జాతీయ ఐక్యత కోసం పని చేసిన మహనీయుడు దీన్‌దయాల్ అని అన్నారు. దీన్ దయాల్ స్థాపించిన జన్ సంఘ్ పార్టీనే ప్రస్తుత బీజేపీ అన్నారు. శ్యాంప్రసాద్ ముఖర్జీతో కలిసి 1951లో జన్ సంఘ్ పార్టీని దీపం గుర్తుతో స్థాపించారని గుర్తుచేశారు. దేశ ప్రజల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని కొనియాడారు. కార్యక్రమంలో నాయ కులు నర్సింహ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



దీన్ దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నిండుగా ఈసీ వాగు



వెంకటాపూర్ వద్ద ఈసీ వాగులో ప్రవహిస్తున్న వరదనీరు

మొయినాబాద్: మండలంలోని వెంకటాపూర్, శ్రీరాంనగర్, సురంగల్, కనకమామిడి, చాకలిగూడ, కేతిరెడ్డిపల్లి, నక్కలపల్లి తదితర గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో మండల పరిధిలోని ఈసీ వాగులో వరద పెరిగింది. రెండు రోజులుగా ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ఈసీ వాగు నిండుగా ప్రవహిస్తోంది.


ఐలమ్మ జయంతిని విజయవంతం చేయండి

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నడిపిన వీరవనిత చాకలి ఐలమ్మ జయంతిని విజయవంతం చేయాలని రజక సంఘం నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చాకలి ఐలమ్మ జయంతిని గురువారం ఉదయం 8 గంటలకు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరవుతున్నారన్నారు. నియోజకవర్గంలోని రజకులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించనున్న చాకలి ఐలమ్మ జయంతి వేడుకలకు రజకులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

మహాజన సభను విజయవంతం చేయండి

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించనున్న మహాజనసభను విజయవంతం చేయాలని పీఏసీఎస్ చైర్మన్ దారమోని బక్కన్నయాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభ ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గతంలో ఎన్ని రుణాలను ఇచ్చాం, రైతులు తీసుకున్న రుణాలు ఎంత మేరకు చెల్లించారు, పీఏసీఎస్ నుంచి ఇచ్చిన రుణాలు ఎంత బకాయిలు ఉన్నాయి, రైతుల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలపై చర్చిస్తామని పేర్కొన్నారు. రైతులు, వ్యవసాయశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రియాజ్

కొందుర్గు: గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై గ్రామ ప్రత్యేకాధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి రియాజ్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తాగునీటి పైపులైన్లు లీకేజీలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమలు, ఈగల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో లక్ష్యానికి మించి మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనురాధ, మండల వైద్యాధికారి డాక్టర్ అమ్రిత జోసెఫ్‌తో పాటు వివిధ గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మున్సిపల్ రికార్డులు స్వాధీనం



కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: ఇటీవల మండలంలోని మిర్జాగూడ గ్రామం నార్సింగి మున్సిపాలిటీలో విలీనమైన విషయం తెలిసిందే. బుధవారం ఈ మేరకు గ్రామానికి సంబంధించిన రికార్డులను ఎంపీడీఓ వెంకయ్య నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డికి అందించారు. ఈ రోజు నుంచి మిర్జాగూడ గ్రామం పూర్తిస్థాయిలో నార్సింగి మున్సిపాలిటీలో కొనసాగుతుందన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

చేగూరు పీఏసీఎస్ చైర్మన్ గొర్లపల్లి అశోక్



మాట్లాడుతున్న అశోక్

నందిగామ: ప్రాథమిక సహాయ సహకార సంఘాలు ఇచ్చే రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చేగూరు పీఏసీఎస్ చైర్మన్ గొర్లపల్లి అశోక్ అన్నారు. మండల పరిధిలోని చేగూరులో చైర్మన్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు కావాల్సిన రుణాలు అందిచేందుకు సిద్ధంగా ఉన్నామని, వీటితో పాటు రైతులకు కావాల్సిన ఎరువులను ఇప్పటికే సమకూర్చామని చెప్పారు. పీఏసీఎస్ రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, పీఏసీఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఈఓ వెంకటయ్య, వైస్ చైర్మన్ మున్నూరు పద్మారావు, సబ్ డివిజినల్ అధికారి సరస్వతి, డైరెక్టర్లు మల్రెడ్డి, అనితా, కొడిచర్ల నర్సింహ, పాండు, ఏఈఓ రవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై చైర్మన్ ఆగ్రహం



కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చైర్మన్ నరేందర్

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కళాశాల ఆవరణలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని ముగించుకొని ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ ఈ కార్యక్రమానికి ఆలస్యంగా హాజరయ్యారు. ఎమ్మె ల్యే కార్యక్రమానికి ముందుగా వస్తున్న విషయం తమకు ఎందుకు చెప్పలేదని మున్సిపల్ చైర్మన్ కమిషనర్‌ను ప్రశ్నించారు. మీకు చెప్పమని మున్సిపల్ మేనేజర్‌కు చెప్పానని కమిషనర్ సమాధానం ఇచ్చారు. నాకు కూడా ఆయన ఎమ్మెల్యేనే మీరు మా మధ్య తగువు పెట్టి బదనాం చేయాలని చూస్తున్నారా అంటూ కమిషనర్‌పై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే షెడ్యూల్ కంటే ముందుగా వస్తున్న విషయాన్ని తమకు తెలియజేస్తే తాము కార్యక్రమానికి హాజరవుతామని, ఇష్టం వచ్చినట్లు అధికారులు వ్యవహరించడం సరికాదని చైర్మన్ కమిషనర్‌పై మండిపడ్డారు.

పనులు పూర్తిచేయాలి

ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అపరిష్కృతంగా ఉన్న పెండింగ్ పనులన్నీ వెంటనే పూర్తిచేయాలని ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. బుధవారం స్వచ్ఛతా హీ సేవ 2024–2025లో భాగంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల పథకంపై గ్రామ కార్యదర్శులు, కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా మొదటి ఫేజ్ లో రూ.25వేలు, రెండో ఫేజ్‌లో రూ.50 వేలు ఇప్పటికే విడుదల చేశామని, ఇంకా పెండింగ్‌లో ఉన్న నీటి సరఫరా పైప్ లైన్లు, విద్యుత్ మరమ్మతులు, సివిల్ వర్క్‌లను పూర్తిచేయాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా గురువారం అన్ని పాఠశాలల్లో పారిశుద్ధ్యం, ప్రతిజ్ఞ వంటి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. విధుల్లో ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని విజ్ఞప్తి చేశారు.

Public Notice

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT: AT: L.B.NAGAR

G.W.O.P.NO. 56 OF 2024

Between:

Smt. Kalpana Nathani W/o Rambabu Mandava, Aged 45 years, Occupation: Housewife, R/o Flat No. B0502, Jayabheri The Peak, Narsingi Village, Puppalaguda, K.V. Rangareddy, Telangana-500075. ...Petitioner

VS

All Concerned ...Respondents

WHEREAS the above Petition has filed by the Petitioner/Guardian, U/s. 8 R/w 29 of Guardianship and Wards Act, 1956 seeking permission of the above mentioned Hon'ble Court to appoint the petitioner as legal guardian and sell minor's property of Petitioner's Daughter by name Srihita Mandava aged about 16 years, Occ: Student. To sell the minor's share and the Hon'ble Court as pleased to order for notice to all general public by way of paper publication. Any concerned person or persons claiming below schedule property of above named minor may be present before the above mentioned Hon'ble court on 01.10.2024 at 10.30 A.M. along with related documents or else this Hon'ble Court may take appropriate steps for further proceeding as per law.

SCHEDULE OF THE PROPERTY

Residential Villa type D, on plot no 18, in survey no's 135 & 136, situated at "Prestige Royal Woods", Kismatpur village, Rajendra nagar Mandal, Ranga Reddy District, Telangana. Total extent of 285.47 Sq mtrs or 341.47 Sq yards and plinth area of 4036 Sqfts. Bounded by: North : Villa on plot no. 19, South : Villa on plot no. 17, East : Villa on plot no. 31, West : 9 mtrs wide road

Sd/- Naga Deepika Peri, Advocate, H.No. 402,Road no 14, Alakapuri Colony,Hyderabad. Ph: 8978755330

Dt: 25.09.2024

క్లుప్తంగా

రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పూర్వ వీఆర్‌ఏలు

కొందుర్గు: రాష్ట్రంలోని పలు గ్రామాలకు సంబంధించిన వీఆర్‌ఏలను గత ప్రభుత్వం మున్సిపల్ శాఖ వార్డు ఆఫీసర్లుగా బదిలీ చేసిందని, తమను తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని పూర్వ వీఆర్‌ఏలు బుధవారం తహసీల్దార్ రమేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జీఓ నెంబర్ 81, 85ల ప్రకారం వీఆర్‌ఏ వ్యవస్థను బదిలీ చేస్తూ పది, పదిహేను ఏళ్ల అనుభవం గల తమను అకారణంగా తమకు ఎలాంటి అనుభవం లేని శాఖలకు సుదూర ప్రాంతాలకు బదిలీ చేసిందని వాపోయారు. కార్యక్రమంలో శ్రీహరి, జయవాణి, కుమార్, రేణుకుమారి పాల్గొన్నారు.

ఆర్థికసాయం



బాధిత కుటుంబసభ్యులకు నగదు అందిస్తున్న నాయకులు

చేవెళ్ల: మండలంలోని రావులపల్లి గ్రామానికి చెందిన యాదయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని అలివ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండడంతో బుధవారం స్థానిక బీజేపీ నాయకులు కృష్ణగౌడ్, కుమార్, డా.విజయ్‌కుమార్, శంకర్, పెద్దోళ్ల కృష్ణ కలిసి రూ.20వేల ఆర్థికసాయం వారికి కుటుంబసభ్యులకు ఆస్పత్రిలో అందించారు. అనంతరం యాదయ్య ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. కుటుంబసభ్యులను పరామర్శించి భరోసానిచ్చారు.

కేశంపేట మండల ఇన్‌చార్జి విద్యాధికారిగా చంద్రశేఖర్



కేశంపేట: మండల ఇన్‌చార్జి విద్యాధికారిగా మండల పరిధిలోని కొత్తపేట గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్‌ను నియమించారు. ఇటీవల ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలు నిర్వహించగా మండలంలో ఇన్‌చార్జి విద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న మనోహర్ ఫరూఖ్‌నగర్ మండలానికి బదిలీ అయ్యారు. ప్రభుత్వం తాజాగా మండల విద్యాధికారిగా చంద్రశేఖర్‌ను నియమించడంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కొందుర్గు మండల విద్యాధికారిగా గాయత్రీదేవి



కొందుర్గు: కొందుర్గు మండల విద్యాధికారిగా ముట్పూర్ హెచ్‌ఎం గాయత్రీదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎంఈఓగా పనిచేసిన కిష్టారెడ్డి శంషాబాద్ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా గాయత్రీదేవికి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీఓ సాయిరాం

చేవెళ్ల: ప్రభుత్వ నిబంధనల ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం అన్నారు. మండలంలోని కమ్మెట గ్రామంలో బుధవారం ఓటర్ల జాబితాను ఆయన పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ.. అర్హులైన వారందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఎవరైనా అర్హత లేకుండా జాబితాలో నమోదు చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటరు జాబితా అంతా పారదర్శకంగా ఉండాలని కోరారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ కృష్ణయ్య, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నోటుబుక్స్

చేవెళ్ల: మండలంలోని కౌకుంట్ల గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ అబ్దుల్ ఇనాయత్ కుమారుడు అబ్దుల్ అర్హాన్ జన్మదినం సందర్భంగా బుధవారం ప్రాథమిక, ఉర్దూ, అంగన్‌వాడీల్లో చదివే విద్యార్థులకు నోటుబుక్స్, స్టేషనరీ అందజేశారు. కార్యక్రమంలో మాజీ వార్డుసభ్యులు రాజు, గౌస్, మహేందర్, హెచ్‌ఎం రాజేందర్ తదితరులు ఉన్నారు.